www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 ఫిబ్రవరి 2023
5
తిరుపతి

నేడు ఆన్లైన్‌లో శ్రీవారి ఆర్జితసేవ టికెట్ల విడుదల

ప్రజాశక్తి - తిరుమల

ఫిబ్రవరి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను బుధవారం రిలీజ్ చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) వెల్లడించింది. ఈ నెల 8 నుంచి ఈ టికెట్లకు రిజిస్ట్రేషన్‌ను ప్రారంభిస్తామని తెలిపింది. బుధవారం ఉదయం 10 గంటలకు బుకింగ్ ప్రారంభించి శుక్రవారం (10వ తేదీ) ఉదయం 10 గంటల వరకు రిజిస్ట్రేషన్ కు అవకాశం కల్పిస్తామని వివరించింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న భక్తులకు లక్కీ డిప్ ద్వారా ఆర్జిత సేవా టికెట్లను కేటాయించనున్నట్లు పేర్కొంది. ఈ ఆర్జిత సేవా టికెట్లు పొందిన భక్తులకు ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు ఆయా సేవల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని వివరించింది. స్వామి వారి కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ తదితర వర్చువల్ సేవల దర్శన కోటా టికెట్లను ఈ నెల 9 న ఆన్ లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి తెలిపింది. టిటిడి అధికారిక వెబ్ సైట్ ద్వారా ఈ సేవలకు సంబంధించిన దర్శన టికెట్లను బుక్ చేసుకోవచ్చని వివరించింది.

వెంకటగిరి మున్సిపాలిటీలో... కొనసాగుతున్న 'రాజకీయ' దాడులు..?

ప్రజాశక్తి - వెంకటగిరి

వెంకటగిరి మున్సిపాలిటీలో ఆనం, నేదురుమల్లి రాజకీయం వేడెక్కుతోంది. ఈ నేపథ్యంలోనే మున్సిపాలిటీలో ఏసీబీ అధికారుల దాడులు రెండో రోజూ కొనసాగాయి. సోమవారం సాయంత్రం నుంచి ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ ఫైళ్లను పరిశీలించారు. మంగళవారం పట్టణ పరిధిలోని ఒక ప్రముఖ నాయకుడి జియో స్మార్ట్ పాయింట్ భవనాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి ఎసిబి అధికారులు కొలతలను పరిశీలించారు. బహిరంగ పరిశీలన మంగళవారం తెల్లవారుజాము నుండి కొనసాగుతోందని ఎసిబి డిఎస్‌పి దేవ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ దాడుల్లో రాజకీయ కారణాలు

ఉండవచ్చునని పలువురు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు, కొంత మంది కౌన్సిలర్లు నూతనంగా నియమించిన నియోజకవర్గ సమన్వకర్తను కలవకపోవడంతో ఈ దాడులు జరుగుతున్నాయని చర్చించుకుంటున్నారు. కలవని ప్రజాప్రతినిధులందరిని స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నియమించడంతో నేదురుమల్లితో కలవడానికి ప్రజాప్రతినిధులు సంకోచంలో పడ్డారు. నియోజకవర్గ సమన్వయకర్త నిర్వహిస్తున్న కార్యక్రమాలను డుమ్మాకొట్టుతుండడంతో ఈచర్యలకు పాల్పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగ్రూపు రాజకీయాలతో అధికారుల్లో అలజడి మొదలైంది. రాబోవు రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయే వేచి చూడాల్సిందే.

టీడీపీ గూటికి 'సత్రవాడ'

చంద్రబాబు సమక్షంలో చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య, ఆయన తనయుడు, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్రవాడ ప్రవీణ్ టీడీపీ గూటికి చేరారు. మంగళవారం వారివురు తమ అనుచరగణంతో కలిసి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు సత్రవాడ మునిరామయ్య నిజాయితీని కొనియాడారు. మునిరామయ్యతో తనుకున్న పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. మంచి వ్యక్తిత్వం, నిజాయితీ గల నేత మళ్లీ టీడీపీలో చేరడం తనకు ఆనందంగా ఉందన్నారు. మునిరామయ్య తనయుడు సత్రవాడ ప్రవీణ్‌కు రాజకీయంగా మంచి భవిష్యత్తు ఇస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అందరూ కలసి శ్రీకాళహస్తిలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకు రావాలంటూ పిలుపునిచ్చారు. సత్రవాడ వెంట ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకి వస్తే... చిత్తూరు జిల్లాకు యూనివర్సిటీ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

టిడిపి అధికారంలోకి వస్తే చిత్తూరు జిల్లాకు యూనివర్సిటీ, హంద్రీనీవా పనులు పూర్తి చేస్తామన్నారు. చిత్తూరులో వైసిపి హయాంలో ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు భూకబ్జాలకు అంతులేకుండా పోయిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. చిత్తూరులో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కమీషన్ సమర్పించుకోవాల్సిందేనని, కమీషన్లు ఇచ్చుకోలేకే చిత్తూరుకు ఫ్యాక్టరీలు రావడం లేదన్నారు. యువగళం పాదయాత్ర 13వ రోజు మంగళవారం చిత్తూరు టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు టిడిపి జిల్లా కార్యాలయం సమీపంలో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ చిత్తూరు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు భూకబ్జాలకు పాల్పడుతూ, ఇంటినిర్మాణాలు, కాంట్రాక్టులు, ఫ్యాక్టరీల అనుమతులకు 10-20 శాతం కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనన్నారు. మైనింగ్, అక్రమ మద్యం మాఫియాకు జిల్లాను అడ్డాగా మార్చేశారన్నారు. వైకాపా నాయకులు మద్యం తయారీ అమ్మకాల్లో కీలకంగా ఉన్నారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియంతలా వ్యవహరిస్తూ వైకాపా నేతల అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నామన్నారు. చిత్తూరు ఎంఎల్ఎ భూకబ్జాలకు అంతులేకుండా పోయిందన్నారు. గుడిపాల మండలం నాగగల్లు ప్రాంతంలో 300 ఎకరాలు కబ్జా చేశారని,

చిత్తూరు - తచ్చూరు రోడ్డులో ఎంఎల్ఎ అన్నకొడుకు శివకుమార్ అక్రమ మైనింగ్‌తో ఆరు కోట్లు కాజేశారన్నారు. చివరకు సిఎం రిలీఫ్‌ఫండ్‌లోనూ పర్సంటేజీలు తీసుకునే దౌర్భాగ్య స్థితికి చేరుకున్నారన్నారు. తమ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు, పసుపుకుంకుమ అందిందని, జగన్ ప్రభుత్వంలో ఉద్యోగాలను ఊడగొట్టి ఉద్యోగులకు నెలనెలా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, చిత్తూరునగర అధ్యక్షురాలు కఠారి హేమలత, పార్లమెంటరీ అధ్యక్షులు పులివర్తినాని, ఎంఎల్‌సి దొరబాబు, నాయకులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, హేమాద్రినాయుడు పాల్గొన్నారు. చిత్తూరు సభాస్థలి నుంచి ప్రారంభమైన యాత్ర హెరిటేజ్ ఫ్యాక్టరీ మీదుగా జీడీనెల్లూరు మండలం బంగారెడ్డిపల్లిలో ప్రవేశించి బస చేయనున్నారు.

ఎవరూ ఊరికే ఇవ్వరు : ఎస్‌పి

నకిలీ లోన్‌యాప్‌లపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్

నకిలీ ఆన్‌లైన్ లోన్‌యాప్‌లతో అప్పు ప్రాణాలకు ముప్పని ఎస్‌పి పి.పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏదీ ఊరికే రాదు.. ఎవ్వరూ ఊరికే ఇవ్వరు' అని ఇంగితజ్ఞానం ఉండి అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యధిక యాప్‌ల వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతోందన్నారు. మొబైల్‌ను వజ్రంలా భద్రపరచుకోవాలని, మారుతున్న కాలానుగుణంగా నేర ప్రవృత్తి మారుతోందన్నారు. చిన్న పిల్లలకు మొబైల్స్ ఇవ్వకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. సైబర్‌క్రైం అవగాహనా సదస్సు మంగళవారం పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. మహిళా వర్సిటీ వీసీ రాజారెడ్డి, రిజిస్ట్రార్ రజనీతో కలిసి 'మొబైల్ హంట్ యాప్'ను ప్రారంభించారు. సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930 కరపత్రికను ఆవిష్కరించారు. మనీట్రాప్, హనీట్రాప్‌లలో చదువుకోని వారే కాకుండా బాగా చదువుకున్న యువతీ యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు ఈ మాయలో పడి మోసపోతున్నారన్నారు. ఆర్థికంగా నష్టపోయి మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యాయత్నం చేస్తున్నారన్నారు. ప్రముఖ సైబర్ నిపుణులైన ఇఎల్ నరసింహారావుచే ఈ అవగాహనా సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి అడ్మిన్ వెంకట్రావు, ఎల్ఒ కులశేఖర్, క్రైం విమలకుమారి, మునిరామయ్య పాల్గొన్నారు.

మహిళలు డిజిటల్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సేఫర్ ఇంటర్నెట్ డే ని పురస్కరించుకొని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, స్టూడెంట్ అఫైర్స్, సెంటర్ ఫర్ విమెన్ సేఫ్టీ సంయుక్తంగా సైబర్ క్రైమ్ పైన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ శారద మాట్లాడుతూ ఇంటర్నెట్ లో ఎవరైనా వేధింపులకు గురయితే వెంటనే తల్లిదండ్రుల కు గానీ, టీచర్ లకు గానీ తెలియ చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన సైబర్ పీస్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ ఐఎల్ నరసింహారావు మాట్లాడుతూ ప్రజలు సైబర్ బెదిరింపులకు గురికాకుండా ఉండేందుకు, వారి గోప్యతకు, వ్యక్తిగత సమాచారానికి యెటువంటి ముప్పు వాటిల్ల కుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విమెన్ సేఫ్టీ సెంటర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా. నీరజ, ప్రొఫెసర్ అరుణ, పిఆర్ఒ డా శ్రీరజని, సైబర్ క్రైం ఇన్స్పెక్టర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

8.10గంటలకే తిరుపతి- గుంతకల్ పాసింజర్ రైలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి నుంచి గుంతకల్ వెళ్లే గుంతకల్ పాసింజర్‌రైళ్లనెంబర్ (07656) వేళల్లో తిరుపతి ఎంపీ గురుమూర్తి మార్పుచేయాలని దక్షణ మధ్యరైల్వే జిఎంకు లేఖలో కోరారు. అందుకు రేల్వేజిఎం స్పందించి మార్పు చేస్తామని పేర్కొనడంతో ఎంపి డాక్టర్ గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. గురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల వినతిమేరకు ఈ సమస్యను రేల్వేజిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. తిరుపతి నుండి పాకాల రైల్వేస్టేషన్ వరకు పని చేసే పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ఎంపీ గురుమూర్తిని వారి కార్యాలయంలో కలిసి తాము తిరుపతి నగరం నుండి రాకపోకలు సాగించి తమ ఉద్యోగ విధులకి హాజరవుతామని వారి పిల్లల విద్యాభ్యాసం వలన అంత దూరం ప్రయాణం తప్పడం లేదని ప్రస్తుతము ఉదయం 8 గంటల 50నిమిషాలకు బయలుదేరే తిరుపతి గుంతకల్ ప్యాసెంజర్ వేళను మార్పు చేసి త్వరగా బయలుదేరేలా చేస్తే అనుకూలంగా ఉంటుందని మొరపెట్టుకొన్నారు. వారి అభ్యర్థన మేరకు ఎంపీ గురుమూర్తి గుంతకల్ డి.ఆర్.ఎం కు లేఖ రాయగా తత్ఫలితంగా పాసెంజరు వేళలో మార్పు చేసి ఉదయం 8 గంటల 10 నిముషాలకి బయలుదేరేలా చేయడం జరిగిందని తెలిపారు. మారిన వేళలు ఈనెల 21 నుండి అమలవుతుందని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

జిల్లాలోని స్విమ్స్, స్వికార్, ఎస్.వి. ఆయుర్వేదిక్ ఆసుపత్రుల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా క్యాన్సర్ స్క్రీనింగ్ (గుర్తింపు) ప్రక్రియ చేపట్టాలని, ప్రథమ దశలోనే క్యాన్సర్ గుర్తింపు జరగాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో త్వరలో జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రక్రియ నిర్వహించడానికి స్విమ్స్, స్వికార్, ఆయుర్వేదిక్ ఆసుపత్రుల డాక్టర్లతో, జిల్లా కలెక్టర్ ప్రణాళిక తయారు ప్రక్రియపై సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభాలో 10 శాతం మందికి క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని సర్వేలు తెలుపుతున్నాయని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో స్విమ్స్, టాటా ఆసుపత్రులకు పింక్ బస్ లు ఉన్నాయని మరో రెండు బస్సులు ప్రభుత్వాన్ని కోరనున్నామని తెలిపారు. ఒకొక్క బస్సులో 120 మందికి స్క్రీనింగ్ చేసే అవకాశం ఉన్నందున జిల్లాలో పూర్తి స్థాయిలో స్క్రీనింగ్ నిర్వహించి కేసులను గుర్తించి చికిత్సలు అందించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ సమీక్షలో డి.ఎం.అండ్ హెచ్.ఓ శ్రీహరి, స్విమ్స్ డా.నాగేశ్వర రావు, డా.చంద్రశేఖర్, ఎస్.వి.ఆయుర్వేదిక్ ఆసుపత్రి రేణుదీక్షిత్ పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ బుక్స్ ఉచితంగా పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ముత్యాల రెడ్డి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్‌పేపర్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముత్యాలరెడ్డి తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తయారు చేయబడిన నూతన విద్యా విధానం మోడల్ టెస్ట్ పేపర్స్ బుక్లెట్స్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. వంశీ రాజు చేతుల మీదుగా పాఠశాల సోషల్ ఉపాధ్యాయులు యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అయిన సురేష్ ఆధ్వర్యంలో అందించారు

ముమ్మరంగా తిరుపతి స్టేషన్ పునరాభివృద్ధి పనులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

రాబోయే 40 ఏళ్లను దష్టిలో ఉంచుకొని రైల్వే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు దక్షిణ మధ్య రైల్వే , తిరుపతి స్టేషన్ పునరాభివృద్ధి పనులను చేపట్టింది. మే, 2022లో ప్రారంభించిన ఈ పునరాభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ పనులు సకాలంలో పూర్తయ్యేలా అన్ని స్థాయిలలో పనిని పర్యవేక్షిస్తున్నారు. ఈ పనులను చేపట్టేందుకు ఈ పి సి విధానంలో కాంట్రాక్టుకు అప్పగించారు. ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి మొత్తం పనులు ఫిబ్రవరి 2025 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న తిరుపతి స్టేషన్ భవనానికి దక్షిణం వైపున కొత్త స్టేషన్ భవనం రాబోతోంది. జియోలాజికల్ సర్వే పూర్తయిన తర్వాత, క్యాంపు కార్యాలయం, కాంక్రీట్ ల్యాబ్ అండ్ స్టోరేజీ షెడ్ల ఏర్పాటు కు సంబందించిన పనులతో పాటు మిగిలిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కొత్త స్టేషన్ భవనానికి పునాదులు కాంక్రీటింగ్ పనులు 100 శాతం పూర్తయ్యాయి . ఇప్పటి వరకు ఫౌండేషన్‌లు, బేస్‌మెంట్ ఫ్లోర్ యొక్క స్తంభాలు, రిటైనింగ్ వాల్‌లో సుమారు 7,450 క్యూబిక్ మీటర్ల కాంక్రీటును ఉపయోగించారు. తదుపరి దశలో, బేస్‌మెంట్ ఫ్లోర్ కోసం కాంక్రీట్ స్లాబ్‌ను సెంట్రింగ్, షట్టరింగ్‌కు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి . వీటికి సంబందించిన పనులు ఇప్పటి వరకు దాదాపు 20శాతం మేర పూర్తయ్యాయి. కొత్త స్టేషన్ భవనంలో 29 లీటర్ల నీటిని నిల్వచేసే సామర్థ్యంతో అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్ ఏర్పాటు కానుంది . దీని కోసం, భూగర్భ ట్యాంకు నిర్మాణ కోసం తవ్వకం పనులు, పునాదులకు కాంక్రీటింగ్ పనులు పూర్తయ్యాయి. తిరుపతి రైల్వే స్టేషన్ ను పునరాభివద్ధిలో భాగంగా స్టేషన్ కు రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం రెండు కొత్త ఎయిర్ కాన్‌కోర్సులను నిర్మించాలని యోచిస్తున్నారు. ఈ ఎయిర్‌కోర్స్‌లు 35 మీటర్ల వెడల్పుతో ఉంటాయి . స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారమ్‌లను, స్టేషన్ భవనాలకు రెండు వైపులా (ఉత్తరం మరియు దక్షిణం) కలుపుతాయి. ప్లాట్ ఫారం నెం 4, 5లో ఎయిర్‌కోర్సుల పునాదుల కోసం తవ్వకం పనులు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి పనులు వేగంగా సాగుతున్నాయి . తిరుపతి స్టేషన్ పునరాభివద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, తద్వారా పనులకు ఆటంకం కలగకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. స్టేషన్‌లో ప్రయాణికులకు, రైళ్ల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత జాగ్రత్తగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

అవార్డు బాధ్యతను మరింత పెంచింది

ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ధనంజయ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు స్వీకరించడం తనలో బాధ్యతను మరింత పెంచిందని ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌళిక వసతుల సదుపాయాల అభివృద్ధి సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు పోలంరెడ్డి ధనంజయరెడ్డి తెలిపారు. స్థానిక రుయా ప్రాంగణంలోని ఆ సంస్థ కార్యాలయంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

ఉమ్మడి చిత్తూరు జిల్లా కెవి పల్లి మండలం చినేపల్లి గ్రామంలో పి.నారాయణరెడ్డి, కృష్ణమ్మ దంపతులకు 1963లో రెండో సంతానంగా తాను జన్మించాను. మాది వ్యవసాయ కుటుంబం. కరువు ప్రాంతమైన పడమటి మండలాల్లో చదువే జీవిత గమనమని పెద్దల మాటను తూ.చ తప్పకుండా పాటించి, ఉన్నత చదువులు చదివాను. 10వ తరగతి వరకు సొంత గ్రామంలోనే చదువు పూర్తి చేశాను. ఇంటర్మీడియట్ పీలేరులో చదివాను. బిటెక్ ఇంజనీరింగ్ పూర్తి చేసి, 1988లో హెల్త్ కార్పొరేషన్ విభాగంలో ఏఈగా విధుల్లో చేరాను. 1988-1997లో కుప్పం, ఆదోని, చిత్తూరు, హైదరాబాదులో విధులు నిర్వహించాను. 2009లో డిఈగా పదోన్నతి పొంది తిరుపతలో విధులు నిర్వహించాను. 2018లో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరుగా పదోన్నతి పొంది, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్

వైద్యసేవలు, మౌళిక వసతుల సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపిఎంఎస్ఐడిసి) ఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. మా సొంతూరులో బిఈడి చేసిన మొదటి వ్యక్తి రామ్ ప్రసాద్ వద్ద చిన్నతనంలో ట్యూషన్‌కు వెళ్లేవాడిని. లెక్కల్లో మంచి ప్రతిభ చూపేవాడిని. దాన్ని చూసి ఆయన నన్ను మరింత ప్రోత్సహించారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని బాగా చదవాలని పట్టుదలతో చదివి, తల్లిదండ్రుల సహకారంతో ఇంతటి వాడిని అయ్యాను. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలను సమూలంగా మార్చి, పేదవారికి ఆధునిక వైద్యసేవలు కల్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి బాగుందన్నారు. చిత్తూరు జిల్లా అంతటా ఉన్న ఆసుపత్రులు, ఆరోగ్య సంరక్షణ సేవలకు జీవం పోసేందుకు సమగ్రమైన పథకాన్ని ప్రారంభించి, వినూత్నమైన, ఆదునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రస్తుతం దృష్టి సారించామన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రాథమిక, మాధ్యమిక, అత్యున్నత ఆరోగ్య సంరక్షణ మౌళిక సదుపాయాలను పటిష్ట పరిచేందుకు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత వైద్యకళాశాలలు, అనుబంధ సంస్థలను పటిష్టపరిచేందుకు నవీనకరణ ద్వారా 600 పడకల సదుపాయాలు గల ఆసపత్రిని సుమారు 100 కోట్ల రూపాయలతో టిటిడి ఆధ్వర్యంలో శ్రీబాలాజీ ఆంకాలజీ ఆసుపత్రి, క ళాశాల భవనాలు ఆధునీకరణ పనులు సుమారు 400 కోట్ల రూపాయలతో ప్రారంభించామన్నారు. శ్రీపద్మావతి మహిళా మెడికల్ కళాశాల ప్రస్తుత భవన సామర్థ్యంతో పాటు ఆంకాలజీ ఆసుపత్రికి కావలసిన కొత్త భవనాలకు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జిల్లాలో పిహెచ్‌సి, ఏరియా ఆసుపత్రులు ఆధునీకరించేందుకు రూ.80 కోట్లతో 12 పనులు మార్చి నాటికి అందరి సహకారంతో పూర్తి చేయనున్నాం.

ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ త్వరగా పూర్తి చేయాలి: జేఈవో

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టీటీడీ గోశాలలో నిర్మిస్తున్న ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, అగర బత్తీల రెండో యూనిట్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జేఈవో సదా భార్గవి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె ఈ పనుల ప్రగతిని పరిశీలించారు. ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌లో చివరి దశలో ఉన్న సివిల్, విద్యుత్ , యంత్రాల పనితీరు పరిశీలన పనులు వారం రోజుల్లోపు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. అనంతరం ఆమె అగరబత్తీల తయారీ రెండో యూనిట్ పనులు పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఉత్పత్తిని రెట్టింపు చేయడానికి అవసరమైన పూల సరఫరా, ఇతర ఏర్పాట్ల గురించి జేఈవో అధికారులకు పలు సూచనలు చేశారు. పశువైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పద్మనాభ రెడ్డి, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ మనోహర్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మార్చిలోపు శ్రీనివాస సేతు పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మార్చి నెలాఖరులోపు రేణిగుంట మార్గం నుండి తిరుచానూరు మ్యాంగో మార్కెట్ వరకు జరుగుతున్న శ్రీనివాస సేతు వంతెన పనులు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. రేణిగుంట మార్గం నుండి రామానుజ కూడలి మీదుగా తిరుచానూరు మ్యాంగో మార్కెట్ వరకు జరుగుతున్న శ్రీనివాససేతు పనుల పురోగతిపై మంగళవారం ఇంజినీరింగ్, అఫ్కాన్స్, ఏఈకామ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు, అనంతరం రేణిగుంట మార్గం, రామానుజ కూడలి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. షెడ్యూల్ ప్రకారం పనులు చేయడం లేదని, ఎక్కువ మంది మనుషులను పెట్టి ఇచ్చిన గడువు లోపు పనులు పూర్తి చేయాలన్నారు. పనుల్లో ఆలస్యం అయితే సహించేది లేదని, అనుకున్న ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఎం.ఈ 1 చంద్రశేఖర్, డి.ఈ. మోహన్, అఫ్కాన్స్ ప్రతినిది రంగస్వామి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు ఉన్నారు. తుడా మార్గంలో స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను కమిషనర్ పరిశీలించారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నింద్ర మండలం జీఎన్ కండ్రిగ పంచాయతీ పరిధిలోని బీజీ కండ్రిగ, ఎంసీ కండ్రిగ గ్రామంలో రూ.8.50 లక్షలతో తాగునీటి బోరు, పైప్‌లైన్లను రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, రాష్ట్ర డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల మండల కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో మంగళవారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల మండల కమిటీ ఎన్నుకున్నట్లు నాయకులు బాలగురవయ్య తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సమావేశం నిర్వహించి ఎంపిక చేపట్టారు. అధ్యక్షులుగా నిర్మల, ఉపాధ్యక్షులుగా లలిత, కార్యదర్శిగా ప్రియా, సహాయ కార్యదర్శిగా బుజ్జమ్మ, కార్యవర్గ సభ్యులుగా సరళ, గౌరీ, జ్యోతి, పద్మావతి, వెంకటమ్మ, కష్ణమ్మ, గీత, పుష్ప, ప్రియ, శ్రీదేవి, ప్రమీల, రమణమ్మ, తాయమ్మ, మల్లెమ్మ, ఉష, ఆదిలక్ష్మి, శాంతి, మునిరత్తమ్మ, వెంకటరమణమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బాల గురవయ్య తెలిపారు.

తుపాను సాయం వివరాలు తెలపండి

తిరుపతి టౌన్: తుపాను, భారీ వర్షాలు, వరదల కారణంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా 2021లో అందించిన నష్టసహాయ వివరాలు ఇవ్వాలని ఎంపి గురుమూర్తి తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు పురస్కరించుకుని నష్టాన్ని అంచనా వేయడానికి అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర బృందాన్ని పంపారా. పంపితే అంచనా వేసిన తేదీతో సహా తెలపాలని పేర్కొన్నారు. కాకపోతే కారణాలు ఏంటో తెలపాలన్నారు. కేంద్ర గృహ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ మాట్లాడుతూ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ నుంచి ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో సహాయ చర్యలు చేపట్టాయని తెలిపారు. పంటలు, రోడ్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు మొదలైన వాటికి రూ.6054.29 కోట్ల నష్టం వాటిల్లిందని, వెంటనే వెయ్యి కోట్లు ఇవ్వాలని అభ్యర్థించిందని తెలిపారు. 2021, నవంబర్ 23న నష్టపరిహారాన్ని అక్కడికక్కడే అంచనా వేయడానికి ఏర్పాటు చేశామన్నారు. రూ.351.43 కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేశామన్నారు.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి సిటి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా జరిగింది. ఫిబ్రవరి 11 నుండి 19వ తేదీ వరకు ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్న విషయం తెలిసిందే. ఉదయం 6.30 నుండి 11 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈవో గురుమూర్తి, ప్రధానార్చకులు బాలాజి రంగాచార్యులు, సూపరింటెండెంట్ ముని చెంగల్రాయలు, టెంపుల్ ఇన్స్ పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్స్ పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

భక్తులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వెనుకబడిన వర్గాల కోసం, వారి అభ్యున్నతి కోసం పాటుపడుతూ ఓటు హక్కు విద్య వంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహించి నేటి వరకు చిరస్థాయిగా నిలిచిన రమాబాయి 125వ జయంతిని రమాబాయి మహిళా సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రేగంటి దేవానంద్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి కార్పొరేషన్ కార్మికులకు, అలిపిరి కాలినడక భక్తులకు, అలిపిరి పరిసర ప్రాంతాల్లోని శరణార్థులకు అలిపిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ జయచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై రమాబాయి జయంతి సందర్భంగా అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై జయచంద్ర మాట్లాడుతూ రమాబాయి పూర్తి సహకారంతోనే అంబేద్కర్ ఉన్నత చదువులు చదువుకొని వెనుకబడిన వర్గాలకు దిక్సూచిగా నిలబడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ సతీష్, కుమార్, రవికుమార్, సుబ్బరత్నం, వెంకటముని, తిరుమలరావు, ఇందిరా, దేశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌కు 'విశ్వం' పూర్వ విద్యార్థి

ప్రజాశక్తి- క్యాంపస్: జాతీయస్థాయి ఖేలో ఇండియా 3వ ఎడిషన్ వింటర్ గేమ్స్-2023కు విశ్వం విద్యా సంస్థల పూర్వ విద్యార్థిని నవశక్తి ఎంపిక అయినట్లు విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వ నాథ్ రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి కర్లింగ్ గేమ్స్ చాంపియన్ షిప్-2022 పోటీలలో మహిళల విభాగంలో దేశ స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకొని కాశ్మీర్ లోని గుల్మర్గ్ లో ఫిబ్రవరి 10 నుంచి 14 వ కు జరిగే ఖేలో ఇండియా 3వ ఎడిషన్ వింటర్ గేమ్స్-2023కు పోటీలకు ఎంపిక అయినట్లు తెలియచేశారు. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వ నాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి నవశక్తి కి అభినందనలు తెలిపారు.

బీసీలకు సముచిత స్థానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వైసీపీలో బీసీలకు సముచిత స్థానం దక్కుతోందనీ, నాయి బ్రాహ్మణులకు ఆలయ పాలక మండలిల్లో సభ్యులుగా తప్పనిసరి చేస్తూ సీఎం జగన్ చట్టం చేయడం ఇందుకు నిదర్శనమని ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల హరి మంగళవారం అన్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని 610 దేవాలయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసే పాలకమండలి (ధర్మకర్తల)లో నాయి బ్రాహ్మణులకు సభ్యులుగా అవకాశం రానుందని చెప్పారు. జగన్ తన పాదయాత్రలో బీసీలకిచ్చిన హామీలను తప్పనిసరి అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి అంటూ కొనియాడారు.

రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఇంటికే..!

మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి -గూడూరు: రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఇంటికిపోవడం ఖాయమని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు టీడీపీ సిద్ధంగా ఉందని గూడూరు నియోజకవర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మీ సునీల్ కుమార్ తెలుగుదేశం పాదయాత్ర 2వ రోజు గూడూరు పట్టణం ఇందిరా నగర్ నుంచి ప్రారంభించారు. మహిళలు కర్పూర హారతులతో స్వాగతాలు పలికారు. ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి నిజస్వరూపాన్ని ప్రజలు ఎప్పుడో గ్రహించారన్నారు. జగన్ రెడ్డి వైఖరి నచ్చక ఆ పార్టీ ఎమ్మెల్యేలే రోజుకొకరు చొప్పున బహిరంగంగా అసంతప్తిని వెళ్లగక్కుతున్నారని తెలిపారు. వారు ఏం మాట్లాడుకుంటున్నారో ఫోన్ ట్యాపింగ్‌లు చేసి ప్రతిపక్షాల నేతల మాటలను దొంగచాటుగా వింటున్నారని విమర్శించారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్, షర్మిల గతంలో పాదయాత్రలు చేసినప్పుడు తెలుగుదేశం పార్టీ వారికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి కుట్రతో లోకేష్ పాదయాత్రకు రోజూ ఆటంకాలు కలిగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఈ కుతంత్రాలను గమనిస్తున్నారని, ఈసారి జరగబోయే ఎన్నికల్లో వైసిపి తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అన్నారు. మూడున్నర ఏళ్లుగా రాష్ట్రంలో అభివద్ధి కార్యక్రమాలు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరోసారి వైసీపీకి అధికారం కట్టబెడితే వలసలు పోవాల్సిందేనని అన్నారు. అప్పులు తెచ్చి పంచడమే అభ్లివృద్ధేనా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి కేవలం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని.. ప్రతిఒక్కరూ తెలుగుదేశం పార్టీకి మద్దతు పలకాలని కోరారు. గూడూరు పట్టణానికి చెందిన జగన్ యువసేన కార్యదర్శి చల్లా శ్రీవర్ధన్‌రెడ్డిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామమందిరం ప్రాంతం వద్ద మాజీ ఎమ్మెల్యేకు గూడూరు పట్టణ సిపిఐ కార్యదర్శి ఎస్.కె కాలేషా పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీ

ప్రజాశక్తి-పిచ్చాటూరు: ముడియూరు, తులసికృష్ణాపురం గ్రామాలలో మంగళవారం తిరుపతి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సామూహిక మొదటి తరహా ప్రదర్శన క్షేత్రాలలో భాగంగా పొద్దుతిరుగుడు ప్రదర్శన క్షేత్ర రైతులకు పురుగు మందులు పంపిణీ చేశారు. వ్యవసాయ డ్రోన్ వినియోగించి పంటలకు మందులు పిచికారీ చేశారు. సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్ .శ్రీనివాసులు మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి భారతీయ వ్యవసాయ పరశోధనా మండలి, న్యూ ఢిల్లీ వారు వ్యవసాయ డ్రోన్ ల వినియోగాన్ని రైతులకు చేరవేయడానికి రాస్ కషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేశారని.. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలలో రైతు పొలాలలో డ్రోన్ వినియోగించి ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డ్రోన్ వినియోగించి ఎకరాకు 6 నుంచి 8 నిమిషాల సమయంలో పిచికారీ చేయొచ్చని తెలిపారు. వ్యవసాయాధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ పొగాకు లద్దె పురుగు నివారణకు విషపు ఎరలు తయారీ, వినియోగం గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య, రాము, కుమార్, ఎంపీటీసీ రాఘవమ్మ, వ్యవసాయ సహాయకులు ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

నాన్న ఆశయం.. ప్రజా సేవకుడిగా ఉంటా..!

నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నాన్న గాలి ముద్దుకృష్ణమనాయుడి ఆశయం మేరకు ప్రజలకు సేవకుడిగా ఉంటానని.. ఆయన ఆశయ సాధనకు నిత్యం కృషి చేస్తానని గాలి భానుప్రకాష్ అన్నారు. పుత్తూరు పట్టణంలో గాలి ముద్దుకృష్ణమనాయుడి ఐదో వర్ధంతి కార్యక్రమంలో నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు పట్టణం తిరుపతి తర్వాత అతి ఎక్కువ విద్యాసంస్థలు ఉన్న విద్యాకేంద్రంగా మార్చిన ఘనత దివంగత మాజీ మంత్రివర్యులు గాలి ముద్దుకృష్ణమ నాయుడని..విద్యా మంత్రిగా కొనసాగుతున్నప్పుడు పేపర్ లీక్ జరిగితే ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వద్దని వారించినా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసి తన నైతిక విలువలు చాటిన మహనీయుడు గాలి ముదుకృష్ణమనాయుడు తెలిపారు. పుత్తూరు, నగరి నియోజకవర్గాలలోని ప్రజలే కాకుండా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పేద ప్రజలు తన తలుపు తడితే వారిని ఉదారంగా ఆదుకున్న ఏకైక నాయకుడు ముద్దుకష్ణమ నాయుడేనన్నారు. అనంతరం ముదుకృష్ణమనాయుడి చిత్రపటానికి నివాళి అర్పించి పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య ఉపాధ్యక్షులు, తెలుగు యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డి.జి.ధనపాల్, డి.ఎస్.గణేష్, చిత్తూరు జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, మాధవ నాయుడు, చిత్తూరు జిల్లా ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మైనార్టీ సెల్ నాయకులు మహమ్మద్ రఫీ, హమీద్‌బాషా, మహిళా నాయకురాలు నాగరత్నం, మోహన, నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

రూ.10 లక్షలు విలువైన ద్విచక్రవాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పుత్తూరు డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు వెంకట మోహన్, గౌరీశంకర్ బృందాలు కలిసి తనిఖీలు చేపట్టారు. పుత్తూరు మండలం తిరుపతి-నగరి బైపాస్ రోడ్డు వేపగుంట క్రాస్ రోడ్డు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానంతో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అరక్కోణ ం ప్రాంతానికి చెందిన మురుగన్, మణిలను అరెస్టు చేశారు. శరత్ పరారీలో ఉన్నాడు. మరో వ్యక్తి కేవీబీపురం మండలం అంజూరుపాల్యం గ్రామానికి చెందిన బసవయ్యలతో కలిసి 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరిచారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

ప్రజాశక్తి-నాయుడుపేట: మండలంలోని మర్లపల్లి వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు నాయుడుపేట ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాజకీయ కక్షతో ఇంటికడ్డుగా ప్రభుత్వ భవనమా..!

ప్రజాశక్తి-ఓజిలి: రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా ఇంటికి అడ్డుగా ప్రభుత్వ భవనం ఏర్పాటు చేస్తున్నారని, రెవెన్యూ అధికారుల దౌర్జన్యం నశించాలని బాధిత కుటుంబాలతో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసనలకు దిగారు. తిరుపతి జిల్లా సిఐటియు నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ ఓజిలి మండలంలోని పున్నేపల్లి దళితవాడలో గత 70 సంవత్సరాల క్రితం సర్వేనెంబర్ 97లో మైలారి పెంచలయ్య , మైలారి సుబ్రహ్మణ్యం నివాస గహాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాలు చాలా ఉన్నా రాజకీయ కక్షలు కారణంగా వీరి ఇంటి వద్దనే కావాలనే ప్రభుత్వ భవనం ఏర్పాట్లు చేస్తున్నారని తెలియజేశారు. రాజకీయ నాయకులు తమ పలుకుబడితో రెవెన్యూ సిబ్బంది, పోలీస్ బలగాలతో వచ్చి బాధితుల ఇంటి ముందు జేసీబీతో గుంతలను తీయడం దారుణమైన చర్యని తెలిపారు. ప్రభుత్వ భవనాలకు తాము ఆటంకం కలిగించడం లేదని..ఐదు అడుగుల స్థలం కేటాయించి నిర్మాణం చేసుకోవాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి స్థలం కేటాయించకుండా అక్రమ కట్టడాలు చేపడితే వివిధ సంఘాలతో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముకుందా, మధ్యాహ్నం భోజనం వంట నిర్వాహకుల యూనియన్ జిల్లా కార్యదర్శి విజయమ్మ , ఐద్వా మహిళా కన్వీనర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించాలి



ప్రజాశక్తి-కోట: మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాలెం దళితవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనం నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలని మంగళవారం కోట తహశీల్దార్ కార్యాలయంలో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు నెల్లూరుపల్లి కొత్తపాలెం దళిత యువకులు వినతిపత్రం అందించారు. నెల్లూరుపల్లి గ్రామంలో సుమారు 400 మంది దళిత కుటుంబాల వారు నివాసాలు ఉంటున్నారని.. యువతీ యువకులు చదువులు కొనసాగిస్తున్నారని.. యువత అవసరాలు, వివాహ శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా స్థలం కేటాయించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఆర్డీవో వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యానాటి నారాయణ, మద్దెల రమేష్, సురేంద్రబాబు, రాంబాబు, దామరపు హరికష్ణ, దార్ల సాయికుమార్, బాల గున్నయ్య, అనిల్, శివకష్ణ, చందు పాల్గొన్నారు.

ఏ నియోజకవర్గాల్లో పోటీచేసేది తెలియజేస్తా..!

ప్రజాశక్తి - తిరుమల: కర్ణాటక రాష్ట్రంలో తాను గెలిచే అవకాశం ఉన్న నియోజకవర్గం నుంచి తన పార్టీని ముందుకు తీసుకెళ్తానని, రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా నాలుగు నెలల సమయం ఉండటంతో ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్న విషయాన్ని నెల రోజుల్లో వెల్లడిస్తామని కల్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ అధ్యక్షుడు గాలి జనార్ధనరెడ్డి తెలిపారు. మంగళవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో గాలి జనార్ధనరెడ్డి, ఆ రాష్ట్ర మంత్రి శ్రీరాములు వేరువేరుగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తితిదే ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

యంత్రాల రూపకల్పనపై అవగాహన

క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం "మెకానికల్ ఇంజినీరింగ్ అసోసియేషన్" ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా "స్టార్టప్స్ మెంటరింగ్ సొసైటీ అండ్ కార్పొరేట్" డైరెక్టర్, "పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, హైదరాబాద్" ట్రైనర్ డా.వెంకట హర్షవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జీవితంలో డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యతపై సలహాలు ఇచ్చారు. సాధారణంగా మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులచే యంత్రాల సరైన రూపకల్పనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సరైన ఆవిష్కరణ ఆలోచనల ఆవశ్యకతను వివరించారు. ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్. సత్యనారాయణ, ప్రొఫెసర్ దివాకర్‌రెడ్డి, వెంకటరామయ్య, రాజేష్‌బాబు, కె.ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నూతన వధూవరులకు 'చెవిరెడ్డి పెళ్లి కానుక'

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీకి చెందిన నూతన వధూవరులకు 'చెవిరెడ్డి పెళ్లి కానుక' ను ఎంపీపీ మోహిత్ రెడ్డి సోమవారం అందజేశారు. పంచాయతీకి చెందిన శాంత కుమారి, విశ్వనాథ రెడ్డి దంపతుల కనిష్ట కుమారుడు సుధీర్ కుమార్ రెడ్డి, ప్రియ ల వివాహం ఈ నెల 10వ తేదీన జరగనుంది. ఈ క్రమంలో వరుడు చెవిరెడ్డి పెళ్లి కానుకను అందుకున్నాడు. ఎమ్మెల్యే చెవిరెడ్డి అందించే పెళ్లి కానుకలో బంగారు తాళి బొట్టు, వెండి మెట్టెలు, వధూ, వరులకు పట్టు బట్టలు, పెళ్లి కుమార్తెకు గాజులు, శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, శ్రీవారి లడ్డు, వడ, అక్షింతలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ డివిజన్ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి, గౌతమి రెడ్డి, సర్పంచ్ జోగి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెండ్

ప్రజాశక్తి-వెంటకగిరి: వెంకటగిరి మండల కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. తిరుపతి జిల్లా పిడి శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అవినీతి అక్రమాలు జరగడంతో సోమసానిగుంట అమ్మపాలెం గ్రామపంచాయతీకి సంబంధించిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లు, ఓ కంప్యూటర్ ఆపరేటర్‌ను పీడీ సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఏపీడీ ప్రేమ్ కుమార్ ,ఎంపీడీవో కోటేశ్వరావు, ఎంపీపీ తనూజ పాల్గొన్నారు.

80 శాతం ఇంజనీరింగ్ పనులు పూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇప్పటివరకు 80 శాతం ఇంజనీరింగ్ పనులు పూర్తి చేసినట్లు ఈవో సాగర్ బాబు తెలిపారు. స్థానిక ఆలయ పరిపాలన భవనంలో మంగళవారం ఆలయ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి ఈవో మాట్లాడారు. మహాశివరాత్రి ఉత్సవాలకు మరో ఐదు రోజులు గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో త్వరిత గతిన ఇంజనీరింగ్ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 22 పనులకు ఆన్లైన్ టెండర్లు పిలవగా 15 పనులు 80 శాతంమేర పూర్తయ్యాయని, తక్కిన పనులను ఉత్సవాలు ప్రారంభమయ్యే లోపే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ పనులకు గాను రూ.1.74 కోట్లను ఖర్చు చేస్తున్నామని చెప్పారు. పదివేల మంది భక్తులు ఒకేసారి దర్శించుకునేలా ఏర్పాట్లు ఉంటాయని వివరించారు.

పుత్తూరు పురపాలక సంఘము

టెండరు నోటీసు నెం. 19/ఇ1/2022-23 తేది: 07-02-2023

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు నెం.19/ఇ1/2022-23

పుత్తూరు పురపాలక సంఘము నందు 14వ ఆర్థిక సంఘపు నిధుల నుండి 5 పనులకు గాను (నిట్ నెం.84/2022-23 టు 88/2022-23) రిజిష్టర్డు కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనికి సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

http://tender.apeprocurement.gov.in

కమిషనరు
పుత్తూరు పురపాలక సంఘం

అందరికీ అందుబాటులో గృహ సారథులు

ప్రజాశక్తి-కేవీబీపురం: పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో గృహ సారథులు, కన్వీనర్లు ఉండాలని.. ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. మంగళవారం మండల కన్వీనర్ గవర్ల కష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మీ నందకుమార్ ఆధ్వర్యంలో కేవీబీపురం మండల పరిషత్తు కార్యాలయం వద్ద సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 19 సచివాలయాల పరిధిలో ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా లేదా తెలుసుకొని అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు తక్షణమే బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- పిచ్చాటూరు: నింద్రలో నేతమ్స్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులతో మంగళవారం చెరకు సంఘం అధ్యక్షులు ఆదినారాయణ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.37 కోట్లను వెంటనే చెల్లించాలని.. గత మూడు సంవత్సరాలుగా రైతులకు చెల్లించకుండా యాజమాన్యం కాలయాపన చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకరు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెరకు రైతు నాయకులు శ్రీనివాస్ యాదవ్, రఘునాథ రెడ్డి, సుదర్శన్ నాయుడు, గోపిరెడ్డి, రామకష్ణయ్య, సుందర్ మోహన్, రైతులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిచ్చాటూరు: నారాయణవనం మండలం కైలాసకోనలోని కైలాసనాథ స్వామి మహాశివరాత్రి గోడ పత్రికలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున కైలాసకోనలో జరిగే శివరాత్రికి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తారని, కైలాసకోనలో జలపాతం కలిగి ఉండటంతో సరిహద్దు ప్రాంతమైన తమిళనాడు నుంచి ఎక్కువమంది వస్తారన్నారు. ఆలయ ఛైర్మన్, పోలీస్ అధికారులు భద్రత కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కైలాసకోన ఛైర్మన్ మునస్వామి యాదవ్, కార్యనిర్వహణాధికారి కష్ణానాయక్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్, సింగిల్‌విండో అధ్యక్షులు ఊరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-తడ: భీములవారిపాలెం, కాశింగాడుకుప్పం పాఠశాలలను మంగళవారం ఎంఈవో ఇందిర తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల వారీగా సంగ్రహణాత్మక మూల్యాంకనం-1 మార్కులను పరిశీలించారు. ట్యాబ్‌లను విద్యార్థులు ఏ విధంగా వాడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, సీఆర్పీ గోపినాథ్ పాల్గొన్నారు.

అసమానతలు తొలగించడం జగనన్నకే సాధ్యం

ప్రజాశక్తి-చిల్లకూరు: సమాజంలో అసమానతలు తొలగించాలంటే జగనన్నకే సాధ్యమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం చిల్లకూరు మండల పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో జగనన్న నువ్వే నమ్మకం మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించాలంటే వైసీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. అసమానతలు రూపుమాపడానికి ప్రధాన కారణం విద్య, వైద్యమని..ఈ రెండు ప్రజలందరికీ సమానంగా అందించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. జడ్పీటీసీ మన్యం శ్రీనివాసులు, గూడూరు ఏఎంసీ ఛైర్మన్ ఓడూరి యమునా, చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షులు చేవూరు నాగరాజు, నారాయణ, నాగిశెట్టి శారదమ్మ, నాయకులు రమేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

In The Court Of The Senior Civil Judge : Kovur
H.M.O.P.No. 3 / 2021

Surisetty Venkata Suresh Babu - Petitioner
Vs
Surisetty Padmalatha - Respondent

Notice

To,
Surisetty Padmalatha,
W/o **Surisetty Venkata Suresh Babu,**
Residing at Chakali Street,
Near Ankamma Temple, Gudur Town,
SPSR Nellore District.

పై నెంబరున పిటిషనరు మీ నుండి విడాకులు కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే13-02-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టు లో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎం.సుందరయ్య యాదవ్, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు అడ్వకేట్, నెల్లూరు.